సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం ¦ 25 ¦ నవంబర్ ¦ 2023



ఆవిష్కరణలపై దృష్టి సారించాలి
యువత నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆర్థిక విభాగం విశ్లేషకులు పాపారావు సూచించారు.
- 8లో



చాంపియన్ 'పేట'
నాగార్జునసాగర్‌లో నిర్వహించిన అంతర్ జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో సూర్యాపేట జిల్లా జట్లు చాంపియన్లుగా నిలిచాయి.
- 8లో



యాదాద్రిలో చండీ యాగం
యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం నిర్వహించారు.
- 8లో

న్యూస్‌రీల్

నేడు చౌటుప్పల్‌లో అమిత్‌షా రోడ్‌షో

చౌటుప్పల్ : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా శనివారం చౌటుప్పల్ పట్టణంలో మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తంగడపల్లిలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి స్టేడియం నుంచి రోడ్ షో ప్రారంభం అవుతుందని, అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి చిన్న కొండూర్ చౌరస్తా వరకు రోడ్ షో కొనసాగుతుందన్నారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రోడ్‌షోలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వాకీటాకీలు అందజేత



యాదాద్రి ఆలయ అధికారులకు వాకీటాకీలు అందజేస్తున్న ఈఓ గీతారెడ్డి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సెక్యూరిటీ సిబ్బందికి ఈఓ గీతారెడ్డి శుక్రవారం వాకీటాకీలు అందజేశారు. భక్తుల భద్రత, వసతుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునే విధంగా వాకీటాకీల్లో మాట్లాడవచ్చన్నారు.

కార్తీకమాసం విశిష్ట కార్యక్రమాలు వాయిదా
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహించతలపెట్టిన విశిష్ట కార్యక్రమాలను వాయిదా వేసినట్లు ఈఓ గీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విష్ణుపుష్కరిణిలో నిర్వహించాల్సిన దీపోత్సవం, శనివారం కార్తీక విశిష్ట దీపోత్సవాన్ని 28, 29 తేదీలకు వాయిదా వేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

నేడు నృసింహుడి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురం పరిధిలో గల మత్స్యగిరి శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం ద్వారతోరణ, ధ్వజకుంభ అరాధన, మూర్తి కుంభారాధన, చతుస్థానార్చన నిత్యహోమాలు, పూర్ణాహుతి, నవకలశ స్నపనం, బలిహరణం, నివేదన తదితర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామి, అమ్మవారి కల్యాణం ఉంటుందని ఈఓ మోహన్‌బాబు తెలిపారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను దేవాదాయ, ధర్మాదాయ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రామకృష్ణారావు పరిశీలించారు.

'మహిళా సమస్యలపై పాలకులకు పట్టింపు లేదు'

భువనగిరిటౌన్ : మహిళా సమస్యలపై పాలకులకు పట్టింపులేదని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి విమర్శించారు. శుక్రవారం భువనగిరిలోని దుంపల మల్లారెడ్డి స్మారక భవనంలో జరిగిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. రాజకీయ పార్టీలకు సైతం మహిళలంటే పట్టింపు లేదని, ఎన్నికల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, పాధ్యక్షురాలు కొండమడుగు నాగమణి, కోశాధికారి కల్లూరి నాగమణితో పాటు మాటూరి కవిత, భాగ్య, కొత్త లలిత, వడ్డెబోయిన స్వప్న, సింగనబోయిన లావణ్య, జయమ్మ, లక్ష్మమ్మ, తాడూరి కలమ్మ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై ఎయిమ్స్‌లో మాక్ డ్రిల్

బీబీనగర్ : అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవల్సిన రక్షణ చర్యలపై శుక్రవారం ఎయిమ్స్‌లోని మెడికల్ కళాశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు మంటలను చల్లార్చే విధానంపై అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్‌అరోరా, వైద్యులు సంగీత, నితిన్‌జాన్, అశోక్ పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకోండి

లక్ష్మీనరసింహుడి సాక్షిగా కాంగ్రెస్‌ను గెలిపించాలి



యాదగిరిగుట్ట సమీపంలోని సైదాపురం వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, ఆలేరు అభ్యర్థి బీర్ల ఐలయ్య, బండ్రు శోభారాణి

- ఎమ్మెల్యే దంపతులు అక్రమాలకు పాల్పడుతున్నారు
- గుత్పల సంఘాలతో బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోవాలి
- ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలి
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు
- ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ
- యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతిస్తామని వెల్లడి

జంగ్ తెలంగాణ

యాదగిరిగుట్ట / యాదగిరిగుట్ట రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి మొక్కు చెల్లించుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్యకు మద్దతుగా యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విజయభేరి సభలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీత దంపతులు అక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సునీతకు ఓటు వేస్తే దోచుకోవడానికి ఆ ఇంటాయన కూడా అదనంగా దొరికాడని గొంగిడి మహేందర్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈనెల 30వ తేదీ వరకు అలర్ట్‌గా ఉండాలని, రజాకార్లను తరిమికొట్టేందుకు దొడ్డి కొమురయ్య ఏర్పాటు చేసుకున్న గుత్పల సంఘాల తరహాలోనే బీఆర్‌ఎస్ నాయకులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే యాదగిరిగుట్టలోని ఆటోలను యాదాద్రి కొండపైకి అనుమతించడంతో పాటు ఆటోల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం సైతం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా గొంగిడి సునీతను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్యను 50 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఐలయ్య గెలుపు ఖాయమైంది : ఎంపీ కోమటిరెడ్డి
వరుణుడు కరుణించడం ద్వారా బీర్ల ఐలయ్య గెలుపు ఖాయమైందని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఐలయ్య గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం బాగుపడాలంటే గంధమల్ల రిజర్వాయర్ నిర్మించాలని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఆరు రోజులు కష్టపడితే ఐలయ్యతో పాటు తాము ప్రజల కోసం శ్రమిస్తామన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యం : మోత్కుపల్లి
కేసీఆర్‌ను గద్దె దించాలన్న ఏకైక లక్ష్యంతో తాను పని చేస్తున్నానని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని, అవినీతి రాజ్యమేలుతుందని, పెత్తందార్ల విధానం వచ్చిందని, వారిని ఇంటికి సాగనంపాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను కేసీఆర్ కాజేశాడని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రజల కోసం పనిచేయడం లేదన్నారు. గంధమల్ల రిజర్వాయర్‌పై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. ఆలేరులో బీఆర్‌ఎస్ గెలవడానికి కేసీఆర్ రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారని, ప్రజలు ఆ డబ్బు తీసుకుని కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. 30వ తేదీ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని పేర్కొన్నారు. ఐలయ్య నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి అని, ఆయన గెలుపు ఖాయమన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి : బీర్ల ఐలయ్య
ఆలేరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్య ప్రజలను కోరారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని, కమీషన్ల కోసం అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. కరోనా సమయంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ సాయం చేశానన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆలేరును రెవెన్యూ డివిజన్‌తో పాటు నూతన మండలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలేరు పట్టణంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మిస్తామని, యాదాద్రి కొండపైకి ఆటోలను పునరుద్ధరిస్తామని చెప్పారు. సభలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి గుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్
యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ విజయభేరి సభలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ కల్లెపల్లి శ్రీశైలం, బీఆర్‌ఎస్ నాయకులు కీసరి బాలరాజు, న్యాయవాడి సూధగాని శ్రీహరితో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు.

వర్షంలోనే ప్రసంగం విన్న ప్రజలు
విజయభేరి సభ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా రాత్రి 8.10కి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ వెంకట్‌రెడ్డి సభా స్థలికి చేరుకున్నారు. సభ జరుగుతున్న సమయంలో వర్షం కురుస్తున్నా కార్యకర్తలు, ప్రజలు కుర్చీలు తలపై పెట్టుకొని నాయకుల ప్రసంగం విన్నారు. రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో సీఎం.. సీఎం అంటూ యువకులు నినాదాలు చేశారు.



సైదాపురంలో జరిగిన సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

గెలిపిస్తే ఐటీ హబ్ తీసుకువస్తా



భువనగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి



భువనగిరిలో మిర్చీలు వేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న గూడూరు నారాయణరెడ్డి

- అర్హులందరికీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తా
- భువనగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : తాను ఎమ్మెల్యేగా గెలిస్తే భువనగిరికి ఐటీ హబ్ తీసుకువచ్చి అర్హులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం భువనగిరిలోని అర్బన్‌కాలనీ, మాసుకుంట, రాయగిరిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి గచ్చిబౌలి, కొల్లూరు ఎంత దూరం ఉన్నాయో.. హైదరాబాద్ నుంచి భువనగిరి కూడా అంతే దూరం ఉందన్నారు. అక్కడ పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ఉన్నాయని, ఇక్కడ లేకపోవడానికి స్థానిక ఎమ్మెల్యే నిరక్ష్యమే కారణమన్నారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ఐటీ ఐబ్ తీసుకువస్తానని, తద్వారా ప్రత్యేక్షంగా 30వేలు, పరోక్షంగా 60 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయమన్నారు. అంతేకాకుండా భువనగిరిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తానని, సంగెం, రుద్రవెల్లి, ఇంద్రియాల వద్ద మూసీపై వంతెనలు నిర్మిస్తానని చెప్పారు. బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వరి మద్దతు ధర రూ.3100, ఎరువులు విత్తనాల కొనుగోలుకు రూ.2,500 ఆర్థిక సాయం, అర్హత గల కుటుంబాలకు రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ధరణి స్థానంలో భూమి యాప్ తీసుకువస్తుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్‌ఎస్ ఖాతాలోకి వెళ్తుందని, బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భువనగిరి పట్టణ కమిటీ అధ్యక్షుడు పాదరాజు ఉమాశంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్లు నల్లమాస సుమ వెంకటేశ్వర్లు, జనగాం కవితా నర్సింహాచారి, రత్నపురం బలరాం నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, పంచెద్దుల బలరాం, లక్ష్మీనారాయణ, కరుణాకర్, ఉడుత భాస్కర్, కోటేష్, మహమూద్, బీజేవైఎం, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు 343 ఓట్లు


భువనగిరి టౌన్ : పోస్టల్ బ్యాలెట్ ద్వారా శుక్రవారం రెండో రోజు 343 ఓట్లు పోలయ్యాయి. ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి వేర్వేరుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు శిక్షణ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి 145, భువనగిరి 198 ఓట్లు పోలయ్యాయి. ఉద్యోగులకు శనివారం శిక్షణ ముగియనుంది. అనంతరం వారు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు పోలింగ్ రోజు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. భువనగిరిలోని వెన్నెల కాలేజీలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆయన పాల్గొని వారికి సూచనలు చేశారు. పోలింగ్ నిర్వహణ ప్రధాన బాధ్యత ప్రిసైడింగ్ ఆఫీసర్లదేనని, పోలింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చెక్‌లిస్ట్ ప్రకారం పోలింగ్ సామగ్రిని సరిచూసుకోవాలని, సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న తరువాత పరిసరాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని పేర్కొన్నారు.ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పోలింగ్ నింబంధనలు తెలియజేయాలని, మాక్ పోలింగుకు హాజరయ్యే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు.ఒక అభ్యర్థి తరపున ఒక ఏజెంట్‌ను మాత్రమే అనుమతించాలని, పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల లోపు రాజకీయ పార్టీలు ప్రచారం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలకు సీల్ వేయాలని, చెక్‌లిస్ట్ ప్రకారం రిసెప్షన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని అప్పగించాలన్నారు.

interview



'ప్రజల సంక్షేమం, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం. పదేళ్ల పాలనా కాలంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసి చూపించాం. 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు. వారి మాయమాటలు నమ్మి మోసపోతే గోసపడతాం. ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ గెలుపు ఖాయం' అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. -సూర్యాపేట

> నాటి కాంగ్రెస్, ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి. బీఆర్‌ఎస్ గెలిస్తేనే అభివృద్ధి ఇంటి ముందుకొస్తుంది.

ప్రజలు మాతోనే..

హ్యాట్రిక్ కొడతాం.. మరింత అభివృద్ధి చేస్తాం

- 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- పదేళ్లలోనే అన్ని రంగాలను అభివృద్ధి చేసి చూపించాం
- కాళేశ్వరం జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేశాం
- కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోతే గోసపడతాం
- ఆ పార్టీకి జిల్లాలోనే ముగ్గురు సీఎం అభ్యర్థులు ఉన్నారు

బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ ఫలాలు అందాలన్న ధ్యేయంతో పని చేస్తున్నాం. ఈ పదేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగింది. ఈ కాలంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకొచ్చా. ఉమ్మడి జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించి బీడు భూములను సస్యశ్యామలం చేశాం. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే రూ.7500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించాం. సూర్యాపేటకు మూసీ మురికినీళ్ల నుంచి విముక్తి కల్పించి మిషన్ భగీరథతో కడుపు నింపుతున్నాం. మునుగోడు, దేవరకొండలో ఇప్పుడు ఫ్లోరోసిస్ సమస్య లేదు. రూ.30 వేల కోట్ల విద్యుత్ థర్మల్ ప్లాంట్ తీసుకొచ్చాం. అన్ని నియోజకవర్గాల్లో మినీట్యాంక్ బండ్‌లు, సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేశాం. యాదాద్రి ఆలయ పునః నిర్మాణం చేసుకున్నాం. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల రూపురేఖలు మారాయి. కాంగ్రెస్ నాయ కులు నోట్ల కట్టలతో వస్తున్నారు. ఆ పార్టీకి ఉమ్మడి జిల్లాలోనే ముగ్గురు సీఎం అభ్యర్థులు ఉన్నారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.

సూర్యాపేట రూపురేఖలు మారాయి

సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ వచ్చాకే అభివృద్ధి జరిగింది. నా హయాంలో రూ.వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశా. సూర్యాపేట గతంలో ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో చూస్తే ఎంత అభివృద్ధి జరిగిందో తెలుస్తుంది. పట్టణంలో హిందూ శ్మశాన వాటిక ఒకప్పుడు ఎలా ఉంది.. ఇప్పుడు మహాప్రస్థానంగా ప్రక్షాళన చేశాం. సద్దుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి బోటింగ్ సౌకర్యం తీసుకొచ్చాం. పుల్లారెడ్డి చెరువును కూడా మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతున్నాం. మెడికల్ కళాశాల, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, లింకురోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాం. ఐటీహబ్, బస్తీ దవాఖానాలు ఏర్పాటయ్యాయి. సూర్యాపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. కళాభారతి, స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. 2014 ముందు సూర్యాపేట పట్టణ ప్రజలు మూసీ మురికి నీటిని తాగారు. ప్రపంచంలో ఒక నగరంలో వదిలిన నీటిని.. మరో పట్టణంలో ప్రజలు తాగడం ఎంత దురదృష్టకరమైన విషయమో జలసాధన సమితి నేత దుశ్చర్ల సత్యనారాయణే వెల్లడించారు. ప్రస్తుతం మిషన్ భగీరథతో కృష్ణా జలాలు ఆస్వాదిస్తున్నారు. ఇలా చెబుతూ పోతే లెక్కలేనంత అభివృద్ధి జరిగింది. నన్ను మరోమారు ఆశీర్వదించి గెలిపిస్తే సూర్యాపేట ఆర్థిక ముఖచిత్రమే మారుస్తా.

వచ్చే ప్రభుత్వంలో మరింత ప్రాధాన్యం

రాష్ట్రంలో మూడవసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుంది. సూర్యాపేట మున్సిపాలిటీలో కూడా మా పాలకవర్గమే ఉంది. మధ్యలో కీలకమైన ఇరుసులాంటి శాసనసభ్యుడు లేకపోతే పైనుంచి కిందకు నిధులు ఏవిధంగా వస్తాయి..? నిధులు రావాలంటే ప్రభుత్వంలో కీలకంగా ఉండాలి. వచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మళ్లీ ఉన్నత స్థానంలో ఉంటా. ఇప్పుడు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశా.. రేపు రూ.10 వేల కోట్లపైనే తీసుకురాగలుగుతా.

పేట అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు

దేశంలోనే ఆదర్శ పట్టణంగా సూర్యాపేటను అభివృద్ధి చేస్తా. మరో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ఐటీ హబ్ ఏర్పాటుతో వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి దొరుకుతుంది. యువత ఇంట్లోనే ఉండి ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. డ్రైపోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి పట్టణంలో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతా. లింగమంతుల స్వామి, ఉర్లుగొండ గుట్టల మధ్య రోప్‌వే ఏర్పాటుతో వల్లభాపురం, గుంపుల తిరుమలగిరి, గుంజలూరు గ్రామాలు నూతన శోభ సంతరించుకోనున్నాయి. ఫణిగిరి, పిల్లలమర్రి శివాలయాలు, ఉర్లుగొండను టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతా. నల్లచెరువును నెక్లెస్ రోడ్డుగా ఏర్పాటు చేసుకుందాం. చైనాలోని చాంజింగ్.. కెనడాలోని వాంకోవర్ సరసన సూర్యాపేట పట్టణాన్ని నిలబెట్టాలన్నదే నా కల.

> నాకు జన్మనిచ్చింది మా అమ్మ. జనం కోసమే నా జన్మ.. జనం కోసం బతకాలనుకున్నప్పుడు నేను తినే ఆ నాలుగు మెతుకులు ఇంట్లో కుటుంబ సభ్యులతోనే కలిసి తినాలనేమీ లేదు. అది గుడిలో కావచ్చు.. బడిలో కావచ్చు.. నన్ను గమ్యస్థానానికి చేర్చే నా ప్రచార వాహనమే కావచ్చు.. నా లక్ష్యం ఒక్కటే ప్రజా సేవ. నా ఆశయం ఒక్కటే.. అదే జన హితం.
> – బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి జగదీష్‌రెడ్డి



కారులోనే భోజనం చేస్తున్న మంత్రి

భువనగిరిలో నేటి నుంచి ఉర్సు



ఉర్సుకు ముస్తాబైన దర్గా



దర్గాలోపల పూర్తయిన ఏర్పాట్లు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని దర్గాలు ఉర్సుకు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతి దర్గా వద్ద రెండు రోజుల పాటు సందల్ (గంధం), చిరాగ్ (దీపారాధన)తో పాటు వివిధ రకాల పూజలు, ఖవ్వాలి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమాలు ఇలా..
25న దర్గా గంజ్ మాజీద్ సందల్, 27న హైదరాబాద్ చౌరస్తాలోని హజ్రత్ హాజీ హర్మైన్ దర్గా సందల్ ఊరేగింపు ఉంటుంది. 28న దీపారాధన.. అదే రోజు ఖాజీ మహెల్లాలోని హజ్రత్ సయ్యద్ షా జమాల్ ఉల్ బహార్ అవులియ్ దర్గా సందల్ ఊరేగింపు నిర్వహిస్తారు. 29న కిసాన్‌నగర్‌లోని హజ్రత్ సయ్యద్ షా బుర్హానోద్దీన్ అవులియా దర్గా సందల్ ప్రదర్శన, 30న దీపారాధన ఉంటుంది. డిసెంబర్ 1న హైదరాబాద్ చౌరస్తాలోని హజ్రత్ సోంటేపీర్ అలై దర్గా సందల్ ఉత్సవం, 2న హజ్రత్ లాల్షి వలీ ఉర్సు సందల్ ప్రదర్శన, 3న దీపారాధన నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ ప్రజా భరోసా


నకిరేకల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా భరోసా సభా వేదికపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు


నకిరేకల్‌లో సభా వేదికపై నృత్యం చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో సభ జరుగుతుండగా వర్షం కురుస్తుండడంతో కుర్చీలు తలపై పెట్టుకున్న కార్యకర్తలు


నకిరేకల్ సభలో ఇందిరాగాంధీ వేషధారణలో చిన్నారి


తిరుమలగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ సభకు తరలివెళ్తున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు

డీకే శివకుమార్‌కు స్వాగతం


డీకేను సన్మానిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: వరంగల్ జిల్లాలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైదరాబాద్ వెళ్తూ భువనగిరిలో కాసేపు ఆగారు. ఆయనకు భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికి సత్కరించారు. ఎన్నికల ప్రచారం, స్థానిక రాజకీయాలపై చర్చించారు. వారి వెంట పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

తాటిచెట్టు ఎక్కి ప్రచారం

నడిగూడెం: కోదాడ స్వతంత్ర అభ్యర్థి, నడిగూడెం మండలం బృందావనపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ నవీన్‌గౌడ్ శుక్రవారం స్వగ్రామంలో వినూత్న రీతిలో ప్రచారం చేశారు. గ్రామంలో గీత కార్మికుల వద్దకు వెళ్లి తనకు ఓటు వేయాలని, తాటి చెట్టు ఎక్కి ప్రచారం చేశారు. పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగులకు మోసం చేసిందని విమర్శించారు.


తాటి చెట్టు ఎక్కి ప్రచారం చేస్తున్న నవీన్‌గౌడ్

ఖర్చులకు ఇస్తాం.. ఓటేసిపోండి



- ఇతర ప్రాంతాలలో ఉంటున్న ఓటర్లను ఫోన్‌లలో సంప్రదిస్తున్న నేతలు



నల్లగొండ టౌన్: పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. అందివచ్చిన ఏ అవకాశాన్ని కూడా వదలకుండా ఓట్ల వేటలో పడ్డారు. ఈ నేపథ్యంలో బతుకుదెరువు కోసం వలసపోయిన వారి ఓట్లపై దృష్టి సారించారు. నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని నల్లగొండ, తిప్పర్తి, కనగల్ ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఓటర్లు హైదరాబాద్, ముంబయి, ఇతర పట్టణాలకు పోయి అక్కడ వివిధ రకాల ఉద్యోగాలు చేస్తున్నారు. వారితోపాటుగా ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారు కూడా ఉన్నారు. వారందరూ అక్కడ ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఓట్లు మాత్రం వారివారి స్వగ్రామాల్లోనే ఉన్నాయి. దీంతో వారందరినీ పోలింగ్ రోజు రప్పించేందుకు కొందరు నేతలకు బాధ్యతలు అప్పగించారు.

కొనసాగుతున్న సంప్రదింపులు

వివిధ పార్టీల నాయకులు వలస ఓటర్ల అడ్రస్‌లను సేకరించి తమ పార్టీకే ఓటు వేయాలని సంప్రదింపులు జరుపుతున్నారు. అన్ని పార్టీల నాయకులు వారితో ఫోన్‌లో మాట్లాడుతూ తమ పార్టీకే ఓటు వేయాలని కోరుతున్నారు. నల్లగొండ పట్టణం, అర్బన్ ప్రాంతాలతోపాటు తిప్పర్తి, కనగల్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది ఓటర్లు ఆయా ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లినట్లు సమాచారం.

ఓటుకు భలే డిమాండ్

పోటాపోటీగా ప్రచారాలు, ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్న అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి పెట్టడంతో ఓటుకు మరింత డిమాండ్ పెరిగిపోయింది. ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. రవాణా ఖర్చులు అదనంగా ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం. మరికొందరు అభ్యర్థులు తాము గెలిస్తే డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇంటి స్థలాలు, బీసీ , దళిత బంధు వంటివి ఇప్పిస్తామని ఆశ పెటుతున్నారని తెలిసింది.

ఎవరికి ఓటు వేశామో తెలుసుకోవచ్చు

భువనగిరిటౌన్: పోలింగ్ రోజు ఈవీఎంలో ఎవరికి ఓటు వేశామో చూసుకునే అవకాశం ఉంది. ఈవీఎంకు వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) మిషన్ అనుసంధానించబడి ఉంటుంది. ఈవీఎంలో మనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయగానే అది వీవీ ప్యాట్ మిషన్‌లో ఏడు సెకండ్ల పాటు ఆ పార్టీ గుర్తుతో సహా డిస్‌ప్లే అవుతుంది. తర్వాత డిస్‌ప్లే అయిన ప్రింట్ దానంతట అదే ప్రత్యేక డ్రాప్ బాక్సులో పడిపోతుంది.

సాంకేతిక సమస్యలతో రేవంత్‌రెడ్డి రాక ఆలస్యం

- వర్షం కారణంగా హెలికాప్టర్‌కు అందని సిగ్నల్స్
- రోడ్డు మార్గం గుండా నకిరేకల్‌కు..

నకిరేకల్: పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం గెలుపు కోసం ప్రజా భరోసా సభ నిర్వహించారు. ఈ సభకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బయల్దేరి మధ్యాహ్నం ఒకటి గంటకు నకిరేకల్‌కు చేరుకోవాల్సి ఉండగా.. హెలికాప్టర్‌లో సిగ్నల్స్ చూపించకపోవడంతో ఆయన రోడ్డు మార్గం గుండా వచ్చారు. దీంతో సాయంత్రం 4.46గంటలకు రేవంత్‌రెడ్డి నకిరేకల్‌లోని సభ ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గం గుండా హైదరాబాద్‌కు బయల్దేరాక హెలికాప్టర్‌కు సిగ్నల్స్ అందడంతో 4 గంటలకు హెలికాప్టర్ ఖాళీగా నకిరేకల్‌లోని వాసవి కళాశాలలో హెలిపాడ్ వద్ద ల్యాండ్ అయ్యి తిరిగి వెళ్లి పోయింది. ఇక్కడ సభ అయిపోయిన తర్వాత రోడ్డు మార్గం ద్వారానే తిరుమలగిరి(తుంగతుర్తి)సభకు వెళ్లారు.

మొన్న బీఆర్‌ఎస్.. నేడు కాంగ్రెస్


ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన తెప్పని శ్రీనివాస్


ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్న తెప్పని శ్రీనివాస్

కోదాడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తెప్పని శ్రీనివాస్ రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడి కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా శుక్రవారం నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. – కోదాడ

రెండున్నర గంటల్లో రెండు పార్టీలు..


బీఆర్‌ఎస్‌లో చేరిన పోతురాజు శంకరయ్య


కాంగ్రెస్ కండువాలతో పాక వెంకట్రాములు, పోతురాజు శంకరయ్య

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన పాక వెంకట్రాములు, పోతురాజు శంకరయ్య శుక్రవారం రెండున్నర గంటల్లో రెండు పార్టీలు మారారు. ఇద్దరూ కాంగ్రెస్ కార్యకర్తలు కాగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు బీఆర్‌ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండలి చినలింగయ్య వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సాయంత్రం 6.30 గంటలకు వారికి మళ్లీ కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఈ రెండు ఫొటోలు గ్రామానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తుడడంతో చర్చనీయాంశమైంది.

27న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సమావేశం


మాట్లాడుతున్న పెరిక వెంకటేశ్వర్లు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సమావేశం ఈ నెల 27న నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు ఆ సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో త్వరలో జరగనున్న ఎన్నికలపై, దళితులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ ఎస్సీ సెల్ బాధ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మొక్క నరసింహ, పుల్లెంల సంపత్, చింతపల్లి కళ్యాణ్, నాగటి మల్లయ్య, చింతపల్లి దాసు, అల్లి రాజు, గండమల్ల మారయ్య, గాదరినరసింహ, సుమన్, రాజు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా స్పోర్ట్స్ మీట్ చాంపియన్ 'పేట'

- బాలికల విభాగంలో సూర్యాపేట, బాలుర విభాగంలో కోదాడ జట్ల గెలుపు

నాగార్జునసాగర్: ఉమ్మడి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులతో రెండు రోజుల పాటు నాగార్జునసాగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్ జిల్లా స్పోర్ట్స్‌మీట్–2023–24లో సూర్యాపేట జిల్లా జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో సూర్యాపేట పట్టణానికి చెందిన, బాలుర విభాగంలో కోదాడకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పలు క్రీడల్లో విజేతలుగా నిలిచారు. అంతర్ జిల్లాలోని 9 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 146మంది బాలికలు, 245మంది బాలురు హాజరై వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య బహుమతులు ప్రదానం చేశారు.

బాలికల విభాగంలో..

బాలికల వాలీబాల్ పోటీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు గెలుపొందగా నల్లగొండ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీలో సూర్యాపేట కళాశాల జట్టు విజయం సాధించగా సెంట్‌మేరీ ఇంజనీరింగ్ కాలేజ్ దేశ్‌ముఖి ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఖోఖోలో సూర్యాపేట జట్టు విన్నర్ కాగా నల్లగొండ జట్టు రన్నరప్‌గా నిలిచింది.



చాంపియన్ షిప్‌తో పాటు మెమొంటోలు అందుకుంటున్న సూర్యాపేట బాలికలు

బ్యాడ్మింటన్ సింగిల్ విభాగంలో నల్లగొండ విన్నర్ కాగా సూర్యాపేట రన్నరప్‌గా నిలిచింది. డబుల్ విభాగంలో నల్లగొండ విన్నర్ కాగా సూర్యాపేట రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నీస్ సింగిల్‌లో సూర్యాపేట విన్నర్ కాగా నాగార్జునసాగర్ ద్వితీయ స్థానంలో నిలిచింది. టేబుల్‌టెన్నీస్ డబుల్‌లో సూర్యాపేట గెలుపొందగా నాగార్జునసాగర్ రన్నరప్‌గా నిలిచింది. చెస్‌లో సూర్యాపేట విన్నర్ కాగా నల్లగొండ జట్టుకు రెండో స్థానం దక్కింది.

బాలుర విభాగంలో..

వాలీబాల్ క్రీడలో అనురాగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు గెలుపొందగా నాగార్జునసాగర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీలో అనురాగ్ కళాశాల విజేత కాగా సెంటిమేరీ ఇంజనీరింగ్ కళాశాల దేశ్‌ముఖి కళాశాల రన్నరప్‌గా నిలిచింది. ఖోఖోలో నల్లగొండ విన్నర్ కాగా అనురాగ్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్‌లో నాగార్జునసాగర్, డబుల్‌లో అనురాగ్ కళాశాల, టేబుల్‌టెన్నీస్ సింగిల్‌లో అనురాగ్ కళాశాల, డబుల్ విభాగంలో అనురాగ్ పాలిటెక్నిక్ కళాశాల, చెస్‌లో అనురాగ్ కళాశాల జట్టు జయకేతనం ఎగురవేశాయి.

యాదాద్రిలో వైభవంగా శత చండీ యాగం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న శత చండీ యాగం శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఆలయ యాగశాలలో స్థాపిత దేవత పూజలు, చండీ హవనం, చండీ పారాయణం వంటి పూజలను సంప్రదాయంగా జరిపించారు. వేద మంత్రాలతో పారాయణికులు, అర్చకులు యాగాది పూజలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయాధికారులు రామారావు, గజివెల్లి రఘు, ఆచార్యులు, పూజారులు, పారాయణీకులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు జరిపిస్తున్న ఆచార్యులు, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకార్చనలు, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు అలంకరించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, సీతారామాచార్యులు, రాజేష్ పాల్గొన్నారు.


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నేరేడుచర్ల : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల పట్టణంలోని జనగబావి వీధిలో నివాసం ఉంటున్న వృద్ధురాలు సైదమ్మ ఈ నెల 21వ తేదీ రాత్రి తన ఇంటి ముందు నిలబడింది. ఈ క్రమంలో పాలకవీడు మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన భూక్య రవి అక్కడికి వచ్చి సైదమ్మ మెడలోని రెండు తులాలు బంగారు పుస్తెలతాడు, రెండు తులాలు నల్లపూసల గొలుసు లాక్కొని పరారయ్యాడు. అపహరించిన సొత్తును రవి విక్రయించేందుకు ప్రయత్నించగా సమాచారం మేరకు అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద బంగారు ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

■ Niva Buba హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నల్లగొండ నందు పనిచేయుటకు మేనేజర్లు కావలెను. అనుభవం / ఫ్రెషర్స్ కూడా ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. : 9121160377 [Y-798290]

■ మా సంస్థకు P/F టైం వర్క్ కొరకు 10th/ ఇంటర్ / డిగ్రీ అభ్యర్థులు 50 మంది కావలెను. P/F-10K, F/T:22K వర్క్ ఫ్రం హోమ్. Priyanka ✆ 84639 30673 [B-491]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824725]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- నైపుణ్యాన్ని వృద్ధి చేసుకుంటేనే ఉపాధి అవకాశాలు
- ఆర్థిక విభాగం విశ్లేషకులు దేవభక్తుని పాపారావు


పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : యువత నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని ఆర్థిక విభాగం విశ్లేషకులు దేవభక్తుని పాపారావు సూచించారు. ముఖ్యంగా తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, విద్యావంతుల్లో ఉద్యోగిత నైపుణ్యాలు తగ్గడం ఆందోళన కరమన్నారు. ఉన్నత విద్య, నైపుణ్య అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పారిశ్రామిక వ్యవసాయ సేవా రంగాల్లో పెట్టుబడులు రావాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అలువాల రవి, విద్యావేత్త గోపాల్‌రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ కొప్పుల అంజిరెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి, పండరయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్థికవేత్త పాపారావు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్ : అనుమానంతో భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామానికి చెందిన శిరీషకు సమీప బంధువు నాగతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పానుగోతు శిరీష ఉల్సాయిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం ఆయాగా పనిచేస్తుంది. కాగా, శిరీష మరొకరితో సఖ్యతగా మెలుగుతుందని నాగ అనుమానించి వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి తరచూ గొడవలు జరుగుతున్నాయి. భర్త చిత్రహింసలు తట్టుకోలేక శిరీష ఈ నెల 22న అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. అప్రమత్తమైన నాగ ముందుగానే అడవిదేవులపల్లి గ్రామ శివారులో గల పెట్రోల్ బంక్ వద్ద చేరుకున్నాడు. నాగ ఆవేశం ఆపుకోలేక తన వెంట తెచ్చుకున్న కొడవలితో శిరీష గొంతు కోశాడు. అంతటితో ఆగకుండా ఆమె జడను సగం వరకు కట్ చేశాడు. బాధితురాలు తప్పించుకుని అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో ఎస్‌ఐ హరిబాబు శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట అడవిదేవులపల్లి ఎస్‌ఐ హరిబాబు తదితరులున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

అడవిదేవులపల్లి: విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో సులభమైన పద్ధతిలో బోధన చేయాలని తొలిమెట్టు కార్యక్రమం రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ సైదిరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రార్థనా సమయానికి ముందే పాఠశాలకు చేరుకున్న ఆయన అనంతరం తరగతి గదుల్లోకి నేరుగా వెళ్లి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలిమెట్టు అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

నల్లగొండ: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని నల్లగొండ జిల్లా విద్యాధికారి భిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సుస్థిర జీవన విధానంపై మన బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి ఎన్‌జీసీ శిక్షణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ ఇంట్లో, విద్యాలయాల్లో పారిశుద్ధ్యం, చెత్త వేరు చేయుట, కంపోస్టు ఎరువు తయారీ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన అన్నారు. ఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ టి.రాధిక మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం యోగా, మార్నింగ్ వాక్ చేయడం, చేతి సంచి వాడకం అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు జిల్లా విద్యాధికారి భిక్షపతి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకిరణ్, సురేష్‌గుప్త, ఇ.వెంకటేశ్వర్లు, వనం లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

27న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: ఈనెల 27న నల్లగొండ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–19 బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ జట్లను ఎంపిక చేయడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి కె.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు బోనఫైడ్, 10వ తరగతి మెమోతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు నర్సిరెడ్డి సెల్: 9440072854 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.